‘మీ సేవా’ పునరుద్ధరణ ఎప్పుడో?

- 2016లో అనారోగ్యంతో నిర్వాహకుడు మృతి
- ఏడేళ్లుగా మూతపడ్డ మీ సేవా కేంద్రం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు



మొగిలిపేట మీ సేవా కేంద్రం పునరుద్ధరించాలని సంతకాలు సేకరిస్తున్న గ్రామస్తులు

మల్లాపూర్‌: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు చేరువగా ప్రభుత్వ రంగ సేవలు అందించాలని ప్రభుత్వం ‘మీ సేవా’ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కాని అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లేక సరిగ్గా పనిచేయడం లేదు. మండలంలోని మొగిలిపేటలో ఏడేళ్లుగా ‘మీ సేవా’ కేంద్రం మూతపడి సేవలు నిలిచిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రభుత్వ సేవలకు ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ‘మీ సేవా’ కేంద్రం నిర్వాహకుడు చిట్యాల చంద్రశేఖర్‌ 2016లో అనారోగ్యంతో మృతి చెందగా, అప్పటి నుంచి మొగిలిపేటలో మీ సేవ సేవలు నిలిచిపోయాయి. కాగా తిరిగి మీ సేవ కేంద్రాన్ని ఎప్పుడు పునరుద్ధరిస్తారోనని గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. మండలంలో రెండో అతిపెద్ద గ్రామంగా ఉన్న మొగిలిపేటలో ‘మీ సేవా’ కార్యాలయం లేకపోవడంతో రైతులు, విద్యార్థులు, వ్యాపారస్తులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మొగిలిపేటలో మీ సేవా కేంద్రాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

8 కిలోమీటర్లు వెళ్లాల్సిందే...

మొగిలిపేటలో తపాలా కార్యాలయం, జిల్లా పరిషత్‌ ఉన్నత, ప్రాథమిక పాఠశాల, శాఖ గ్రంథాలయంతో పాటు 6 అనుబంధ గ్రామాలతో కెనరా బ్యాంక్‌ ఉంది. గ్రామంలో 90 శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. దీంతో రైతులు పంటరుణాలకు కావాల్సిన పహణీలతో పాటు ఇతర రెవెన్యూ సేవలకు, పంటరుణాలకు సంబంధించి రెవెన్యూ ధ్రువీకరణ పత్రాలకు, విద్యార్థులతో పాటు గ్రామస్తులకు ఆధార్‌ కార్డు, ఓటరు కార్డు, కుల, ఆదాయ, నివాస, మొదలైన ధ్రువీకరణ పత్రాల కోసం ‘మీ సేవా’ కేంద్రం సేవలు నిలిచిపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లాల్సిందే. సుమారు 8 కిలోమీటర్లు ప్రయాణించి మండల కేంద్రానికి వెళ్లాల్సిందే..

‘మీ సేవా’ ఏర్పాటుకు కృషి చేయాలి...

‘మీ సేవా’ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాజకీయాలకు అతీతంగా అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తుల నుంచి సంతకాల సేకరణ చేపట్టి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మీ సేవా కేంద్రం ఏర్పాటుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



‘మీ సేవా’ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాల కోసం మల్లాపూర్‌ మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. ఆక్కడి మీ సేవ కేంద్రం వద్ద పడిగాలుపులు కాయాల్సి వస్తుంది.

–గొల్లపత్తిని గణేశ్‌, మొగిలిపేట

పునరుద్ధరించాలి



ప్రజల సౌకర్యార్థం మొగిలిపేటలో ‘మీ సేవా’ కేంద్రంను ఏర్పాటు చేయాలి. కెనరా బ్యాంక్‌లో పంట రుణాలకు మల్లాపూర్‌కు వెళ్లి ‘మీ సేవా’ పహణీ తీసుకుని మొగిలిపేట బ్యాంక్‌ రావాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు తక్షణమే ‘మీ సేవా’ కేంద్రాన్ని తిరిగి పునరుద్ధరించాలి

– వనతడుపుల నాగరాజు, సర్పంచ్‌, మొగిలిపేట

మా పరిధిలోకి రాదు



‘మీ సేవా’ కేంద్రాల మంజూరుగాని, పునరుద్ధరణకు సంబంధించిన అంశం మా పరిధిలోకి రాదు. ‘మీ సేవా’ పునరుద్ధరణ కోసం ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు మా దృష్టికి తీసుకువస్తే కలెక్టర్‌కు నివేదించి కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తాం.

– తోట రవీందర్‌, తహసీల్దార్‌,మల్లాపూర్‌

క్లుప్తంగా

ధరణి కంప్యూటర్‌ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఆపరేటర్లు

జగిత్యాలరూరల్‌: ధరణి పోర్టల్‌ వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కంప్యూటర్‌ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ధరణి టెక్నికల్‌ స్టాఫ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు చీటి అభిలాష్‌రావు, ఉపాధ్యక్షుడు కోటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి నాగునూరి హరీశ్‌ పాల్గొన్నారు.

‘కళాకారులకు మంత్రి కేటీఆర్‌ అవమానం’


మాట్లాడుతున్న కళాకారులు

రాయికల్‌: రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ తెలంగాణ కళాకారులను అవమానించడం సరికాదని పట్టణంలోని కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రాయికల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమించిన కళాకారులకు ఉద్యోగం కల్పించాలని మంత్రి కేటీఆర్‌ దృష్టికి తీసుకెళ్లగా అవమానించడం సరికాదని, రాబోయే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామన్నారు. కార్యక్రమంలో భూక్య గంగాధర్‌ నాయక్‌, స్వామి, కుర్సెంగ ప్రసన్నకుమార్‌, లక్ష్మీనర్సయ్య, రవీందర్‌, రజనీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి డీఎస్పీల పరామర్శ


బాధితుడిని పరామర్శిస్తున్న డీఎస్పీలు

కథలాపూర్‌: మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన అంబల్ల లింబాద్రి ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని జగిత్యాల డీఎస్పీ ప్రకాశ్‌, మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. అంతకుముందు వైఎస్సార్‌ టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ బాధితకుటుంబాన్ని పరామర్శించారు. ఓ మంచి వ్యక్తిని కోల్పోయామని పేర్కొన్నారు.

ఇంటింటా వైద్య పరీక్షలు


వృద్ధురాలికి బీపీ చూస్తున్న వైద్యురాలు

కథలాపూర్‌: మేడిపెల్లి మండలకేంద్రంలో చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా తిరిగి వైద్యులు ప్రజలకు వైద్యపరీక్షలు చేశారు. ప్రజల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని వారికి బీపీ, షుగర్‌ పరీక్షలు చేశారు. 20 మంది వైద్యులు గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో సింగిల్‌ విండో డైరెక్టర్‌ క్యాతం రాజేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్‌ పోతు గణేశ్‌, నాయకులు అంకం శ్రీనివాస్‌, తునికి రాజు, గుండోజి కర్ణాకర్‌, అయిల్నేని సుగుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమంపై అవగాహన కల్పించాలి

పెగడపల్లి: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి అన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం రైతు సమన్వయ సమితి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు, రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి చర్చించి గ్రామాల్లో రైతులకు వివరించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు, రైతు సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో విజయం సాధించాలి

వెల్గటూర్‌: త్వరలో తెలంగాణలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించేలా నాయకులు కృషి చేయాలని మంత్రి కొప్పుల ఈశ్వర్‌ అన్నారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించేందుకు అనుసరించే వ్యూహాలపై హైదరాబాద్‌ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం వెల్గటూర్‌ మండల నాయకులతో మంత్రి చర్చించారు. ప్రభుత్వం పథకాలను గురించి ప్రజలకు వివరించాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో పెద్దపెల్లి ఎంపీ వెంకటేశ్‌ నేత, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు పొనుగోటి శ్రీనివాసరావు మండల నాయకులు పాల్గొన్నారు.

‘రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు’


మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌ రెడ్డిపై రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని టీపీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలో సోమవారం మాట్లాడుతూ కేటీఆర్‌ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. అధికార పార్టీ ధర్నాలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. రాహుల్‌గాంధీపై కూడా బీఆర్‌ఎస్‌ నాయకులు అనుచిత వాఖ్యలు సరికావన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పట్టణ, మండల అధ్యక్షుడు గంగాధర్‌ గౌడ్‌, కొంతం రాజం, సత్యనారాయణ గౌడ్‌, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ న్యాయ దినోత్సవం


న్యాయవాదులను సన్మానిస్తున్న అలయన్స్‌ క్లబ్‌ సభ్యులు

జగిత్యాలజోన్‌: అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా జగిత్యాల కోర్టులో సోమవారం మహిళా న్యాయవాదులు సంబురాలు జరుపుకున్నారు. కేక్‌ కట్‌ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ ముదుగంటి త్రిపుర, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సన్మానం

రాయికల్‌: అంతర్జాతీయ న్యాయ దినోత్సవం పురస్కరించుకుని రాయికల్‌ లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో న్యాయవాదులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ మోర హన్మండ్లు, లయన్స్‌క్లబ్‌ డీసీలు మ్యాకల రమేశ్‌, కాటిపల్లి రాంరెడ్డి, గంగాధర్‌, లయన్స్‌క్లబ్‌ అధ్యక్షుడు కొమ్ముల ఆదిరెడ్డి,న్యాయవాదులు పాల్గొన్నారు.

కోరుట్ల: ప్రపంచ న్యాయదినోత్సవం సందర్భంగా అలయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ కోరుట్ల ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అలై పాటిల్‌ ధరందీప్‌, జిల్లా ఉప గవర్నర్లు అలై కటుకం సురేందర్‌, అలై కైలాస నాగేశ్వర రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: అంతర్జాతీయ న్యాయదినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నంలో లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో న్యాయవాదులను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్‌ ప్రధాన కార్యదర్శి రెబ్బటి రాజశేఖర్‌, మాజీ అధ్యక్షుడు ఎలేటి చిన్నారెడ్డి, నేమూరి సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

భూషణరావుపేటలో పిల్లల వైద్యశిబిరం


పిల్లలను పరీక్షిస్తున్న వైద్యుడు నరేందర్‌

కథలాపూర్‌: మండలంలోని భూషణరావుపేటలో సోమవారం కోరుట్ల సూర్య హాస్పిటల్‌ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తల్లిదండ్రులకు సీజనల్‌ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్ష కాలంలో పిల్లలను బయటకు పంపించవద్దని, రోడ్లపై ఉండే తినుబండరాలు తినిపించవద్దన్నారు. కార్యక్రమంలో పిల్లల వైద్యుడు నరేందర్‌, సర్పంచ్‌ కూన సులోచన, శ్రీనివాస్‌, ఆంజనేయులు, అశోక్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు..

మల్యాల: మండలంలోని నూకపల్లి గ్రామ పంచాయతీ భవనంలో సోమవారం కార్మిక శాఖ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్‌ కార్డులున్న కార్మికులకు ఉచితంగా గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. వారం రోజుల్లో వ్యాధి నిర్ధారిత పత్రాలు అందజేస్తామని జిల్లా కో– ఆర్డినేటర్‌ డి.శ్రీనివాస్‌ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ మారంపల్లి సరోజన, ఉప సర్పంచ్‌ సులుగొండ సురేశ్‌, క్యాంపు కోఆర్డినేటర్‌ ఎండీ.రఫీ, డాక్టర్‌ ప్రణయ్‌ పాల్గొన్నారు.

బీసీలకు అన్నిరంగాల్లో 60శాతం రిజర్వేషన్లు కల్పించాలి


నినాదాలు చేస్తున్న బీసీ కుల సంఘాల నాయకులు

మల్లాపూర్‌: జనాభా ప్రతిపాదికన బీసీలకు అన్నిరంగాలలో 60 శాతానికి పైగా రిజర్వేషన్లను అమలు చేయాలని బీసీ కులాల జేఏసీ నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్‌ చేశారు. మండలంలోని ముత్యంపేటలో సోమవారం బీసీ కుల సంఘాల సభ్యులు సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జనాభా ప్రాతిపదికన అమలు చేస్తున్న రిజర్వేషన్లను బీసీలకు వర్తింపచేయాలన్నారు. బీసీల అభివృద్ధికి అన్ని రాజకీయ పక్షాలు కృషి చేయాలని, అన్ని రంగాలలో బీసీలు అభివృద్ధి చెందేవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనివ్వాలని డిమాండ్‌ చేశారు. బీసీ కులాల ఐక్యతతోనే హక్కులు సాధ్యమన్నారు. అనంతరం బీసీ కులాల జేఏసీని ఏర్పాటు చేశారు. సమావేశంలో గౌడ, పద్మశాలి, గంగపుత్ర, విశ్వబ్రాహ్మణ కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలి


రాయికల్‌లో భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు

మల్యాల: కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా పోరాటం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటయ్య పిలుపునిచ్చారు. మల్యాలలో పంచాయతీ కార్మికుల దీక్షకు సోమవారం జిల్లా నాయకుడు కోమటి శేఖర్‌తో కలిసి మద్దతు తెలిపారు. కార్మికులు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. తమ జీవితాలను ఫణంగా పెట్టి పనులు చేస్తున్నా పారిశుధ్య కార్మికులకు గుర్తింపునివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్లు సాధించే వరకు పోరాటం చేయాలనికోరారు.

పంచాయతీ కార్మికుల భిక్షాటన

రాయికల్‌: పంచాయతీ కార్మికుల సమ్మెలో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భిక్షాటన చేసి కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: పంచాయతీ సిబ్బంది డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేలా ఒత్తిడి తీసుకురావాలని సోమవారం ఎంపీపీ జాజాల భీమేశ్వరి, బీఆర్‌ఎస్‌ నాయకుడు డాక్టర్‌ సంజయ్‌కి వినతిపత్రాన్ని అందచేశారు.

వెల్గటూర్‌: 11 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో ప్రభుత్వ వైఖరికి నిరసనగా వెల్గటూర్‌లో పంచాయతీ కార్మికులు సోమవారం భిక్షాటన చేశారు.మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలలో భిక్షాటన చేసి ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



రైతువేదిక వద్ద బీఆర్‌ఎస్‌ నేతలు, రైతులు

బుగ్గారం: ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను,వివిధ కార్యక్రమాలను నాయకులు,కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని జెడ్పీటీసీ బాదినేని రాజేందర్‌ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు,రైతుభీమా,రైతువేదికల నిర్మాణం,ఎరువుల,విత్తనాల సరఫరా,ధాన్యం కొనుగోలు వంటి విషయాలపై వాటి వలన రైతాంగానికి జరుగుతున్న ప్రయోజనం గురించి మరింతగా అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ సుచేందర్‌, మండల ఎంపీపీ కో ఆప్షన్‌ అబ్దుల్‌ రహమాన్‌, రైతుబంధు సమితి నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

వెల్గటూర్‌: కాంగ్రెస్‌ పాలనలో రైతులు కరెంట్‌ కష్టాలు అనుభవించారని బీఆర్‌ఎస్‌ నాయకులు అన్నారు. వెల్గటూర్‌ రైతువేదిక వద్ద ఉమ్మడి వెలటూర్‌ మండల బీఆర్‌ఎస్‌ నాయకులు రైతులు మాట్లాడారు. కాంగ్రెస్‌ హయాంలో పగలు మూడు గంటలు, రాత్రి 4 గంటలు కరెంట్‌ ఇవ్వడం వల్ల రాత్రి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన తన తండ్రి కరెంట్‌ షాక్‌తో చనిపోయాడని, అదే బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో 24 గంటల కరెంట్‌ వల్ల రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వెల్గటూర్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ పత్తిపాక వెంకటేశ్‌, వెల్గటూర్‌,ఎండపల్లి మండలాల బీఆర్‌ఎస్‌ అధ్యక్షులు చల్లూరి రాంచంద్రం, జగన్‌, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సాగునీటి వనరులతో తాళ్లధర్మారం సస్యశ్యామలం


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సారంగాపూర్‌: సాగునీటి వనరులతో తాళ్లధర్మారం సస్యశ్యామలం కానుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ అన్నారు. మీరు నేను కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పల్లె నిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళ్ల ధర్మారంలో వృథాగా పోతున్న నీటికి అడ్డుకట్ట వేసి చెక్‌డ్యాం నిర్మాణం పూర్తి చేశామని, రూ.136 కోట్లతో రోళ్లవాగు ఆధునీకరణ పనులు 95 శాతం పూర్తయ్యాయని, దీంతో పాటు రూ. 1.41 కోట్లతో అరగుండాల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి దాదాపు పనులు పూర్తి కావొచ్చినట్లు తెలిపారు. గ్రామంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కింద ఖర్చు చేసిన నిధుల వివరాలను ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. కాగా మంగళవారం రేకులపల్లి, బీర్‌పూర్‌ గ్రామాల్లో పర్యటించనున్నారు. ఆయన వెంట మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నల్ల మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ నారపాక రమ, బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షుడు నారపాక రమేశ్‌, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

కాంగ్రెస్‌ పార్టీలో నూతన ఉత్సాహం


మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం

కొండగట్టు: కర్ణాటకలో గెలుపుతో కాంగ్రెస్‌ పార్టీలో నూతన ఉత్సాహం వచ్చిందని ఎల్‌డీఎంఆర్‌సీ చొప్పదండి అసెంబ్లీ ఇన్‌చార్జి సంగీతం శ్రీనివాస్‌ అన్నారు. కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో కొడిమ్యాలలోని మున్నురుకాపు సంఘ భవనంలో సోమవారం నిర్వహించిన ఎల్‌డీఎంఆర్‌సీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బూత్‌ స్థాయి నుంచి పార్టీ పటిష్టం కోసం ప్రతీ నాయకుడు కార్యకర్త పాటుపడాలన్నారు. చొప్పదండి కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి మేడిపెల్లి సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్‌ పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అధికార పార్టీ నాయకులు పిచ్చి మాటలు మాట్లాడుతున్నారన్నారు. తమను పట్టించుకోవడం లేదని, సత్యంపై అసంతృప్తితో సమావేశానికి చాలామంది ముఖ్య నాయకులు హాజరు కాలేదని సమాచారం. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు చిలువేరి నారాయణ గౌడ్‌, కేడీసీసీబీ డైరెక్టర్‌ గుడి మల్లికార్జున్‌రెడ్డి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ గడ్డం జీవన్‌ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

సారంగాపూర్‌: మండలంలోని బట్టపల్లి గ్రామానికి చెందిన దేశరాజుల అభికృష్ణ అనే యువకుడు నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఏడాదిన్నర క్రితం తండ్రి మృతిచెందగా, ఎదిగి వచ్చిన కుమారుడు అభికృష్ణ మృతిచెందడంతో తనను తీవ్రంగా కలిచివేసిందని అన్నారు. మృతుడి తల్లి, అక్కలను ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్సీ భరోసా ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు కోండ్ర రాంచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్‌ అప్పగింత

కథలాపూర్‌: మేడిపెల్లి మండలకేంద్రానికి చెందిన బొంగోని మహేశ్‌ అనే వ్యక్తి సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా, ఎస్సై చిరంజీవి సోమవారం అతనికి అప్పగించారు. ఏప్రిల్‌ 16న మహేశ్‌ సెల్‌ఫోన్‌ పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆధునిక టెక్నాలజీతో పోలీసులు సెల్‌ఫోన్‌ను గుర్తించి మహేశ్‌కు అప్పగించారు. సెల్‌ఫోన్‌ను అందించిన ఎస్సైకి మహేశ్‌ కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం

పెగడపల్లి: మండల కేంద్రానికి చెందిన ఓ నిరుపేద ఒంటరి మహిళ ఇంటి నిర్మాణానికి సర్పంచ్‌ మేరుగు శ్రీనివాస్‌ సామగ్రి అందించి ఉదారత చాటుకున్నారు. ఏల్పుల మైసమ్మ అనే మహిళ పూరాతన రేకుల షెడ్డులో నివాసముంటోంది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు గోడలు కూలిపోయి నీడలేకుండా పోయింది. విషయం తెలుసుకున్న మైసమ్మకు ఇంటి నిర్మాణానికి అవసరమగు ఇనుప రేకులు, ఇనుప పైపులు, ఇతర సామగ్రి, మొత్తంగా రూ. 30 వేల విలువ చేసే సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

రాయికల్‌కు నైట్‌ సర్వీసులు నడిపించాలి

జగిత్యాలటౌన్‌: 90 గ్రామాలకు అనుసందానంగా ఉన్న రాయికల్‌ మండల కేంద్రానికి రాత్రి వేళలతో పాటు వేకువ జామున బస్‌ సర్వీసులు నడపాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బెక్కం జనార్దన్‌ కోరారు. సోమవారం జగిత్యాల డిపో మేనేజర్‌ వెంకటనర్సప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్‌ మాట్లాడుతూ రాయికల్‌కు రాత్రిపూట బస్‌ సర్వీసులు లేకపోవడంతో ప్రైవేట్‌ వాహనాల దోపిడీ పెరిగిందన్నారు. అడిగినంత ఇస్తేనే ప్రయాణికులను రాయికల్‌కు చేరుస్తున్నారని తెలిపారు.

ఆత్మీయ సన్మానం

జగిత్యాల: తెలంగాణ గెజిటెడ్‌ జూనియర్‌ లెక్చరర్స్‌ అసోసియేషన్‌ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అత్తినేని శ్రీనివాస్‌ను సోమవారం ఉపాధ్యాయ యూనియన్‌ నాయకులు, అధ్యాపకులు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన శ్రీనివాస్‌ సమస్యల పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, తపస్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్‌, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బైరం హరికిరణ్‌, మచ్చ శంకర్‌, వైద్యులు పాల్గొన్నారు.

ఆలయం ఎదుట చెత్తాచెదారం తొలగింపు



బుగ్గారం: మండల కేంద్రంలోని పోచమ్మతల్లి ఆలయం ఎదుట పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సోమవారం ఉదయం తొలగించారు. ‘దుర్గంధంగా ఆలయ పరిసరాలు’ అనే శీర్షికన సోమవారం సాక్షి పత్రికలో వార్త ప్రచురితం కాగా, స్పందించిన పంచాయతీ అధికారులు ప్రత్యేకంగా కూలీలను ఏర్పాటు చేయించి చెత్తను తొలగింపజేశారు.అంతేకాకుండా ఆ పరిసరాలను బ్లీచింగ్‌ చేశారు.దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి స్పందన